క్లుప్తంగా

కౌలురైతు కార్డుల పంపిణీకి సిద్ధం

జి.కొండూరు: ఖరీఫ్ సాగు ప్రణాళికలో భాగంగా కౌలురైతులకు కార్డులను అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ రోహిణీదేవి, ఏఓ రాంకుమార్ బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భూ యజమానుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కౌలు రైతులకు కార్డులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్డుల వలన కౌలుదారులు రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల కొనుగోలు తదితర ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. జి.కొండూరు మండల పరిధిలోని 16 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని 2,870 మంది కౌలు రైతులకు ఈ నెల 22వ తేదీ నుంచి 30 వరకు కార్డులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పంటసాగు హక్కుపత్రం కలిగి ఉండాలి

దాములూరు(ఇబ్రహీంపట్నం): ప్రతి కౌలు రైతు పంటసాగు హక్కుపత్రం కలిగి ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి డి.శైలజ సూచించారు. దాములూరు, చిలుకూరు గ్రామాల రైతులకు కౌలురైతు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా పత్తిసాగు రైతులు కౌలు హక్కు పత్రం కలిగి ఉండటం ద్వారా అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల బీమా పథకం పొందేందుకు అర్హులు అవుతారన్నారు. సెంటుభూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు వైఎస్సార్ రైతు భరోసా పథకం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

ఎంఈఓ-2 కు అభినందన



జి.కొండూరు: మండల విద్యాశాఖ రెండో అధికారిగా బాధ్యతలు చేపట్టిన వీరాస్వామిని స్థానిక ఉపాధ్యాయులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.వెంకటనర్సింహారావు, యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నూజివీడు: నిబంధనలు ఉల్లంఘించి, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ ఏలూరు జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఈఓ-2 జమలయ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రతి ప్రైవేటు పాఠశాల వద్ద ఫీజుల వివరాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ పట్టణ నాయకులు శ్రీను, బాలు, యశ్వంత్, వెంకట్, శివ పాల్గొన్నారు.

జన జాగృతి సభను విజయవంతం చేయాలి

ఊటుకూరు(గంపలగూడెం): మాదిగ రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించనున్న జన జాగృతి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ ఎం. గోపాల్ తెలిపారు. మండలంలోని ఊటుకూరులో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై ఏడో తేదీన ఎస్సీ వర్గీకరణ సాధన కోసం విజయవాడలో ఈ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం. సంపత్‌కుమార్, ఎం.మల్లేశ్వరరావు, బి.బజార్, టైటస్, బాబురావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న సురక్ష'



నూజివీడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ నేతృత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీలకు అవగాహన కల్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ జూన్ 23 నుంచి జులై 23 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాసమస్యలన్నింటిని పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు సంబంధించిన పత్రాలు, సర్టిఫికెట్లు ఉంటే ఉచితంగా అందించాలన్నారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడికక్కడ శిబిరాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తిరువూరు: నిత్యం వ్యాయామం, యోగాసనాలతో మానసిక, శారీరకంగా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఒత్తిడిని అధిగమించేందుకు యోగా సరైన మార్గమని తెలిపారు. యోగా శిక్షకులు వెంకటరెడ్డి, పూర్ణజ్యోతి, వాహినీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాశీకృష్ణ, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంటు నాగేశ్వరరావు, ఏఓ కిషోర్‌బాబు పాల్గొన్నారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల, మల్లేల ఎంపీయూపీ స్కూలు, వాసవీ క్లబ్, లక్ష్మీపురం ఎన్ఆర్ఈజీఎస్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయంలో యోగాసనాలతో విద్యార్థులు అలరించారు. రాష్ట్ర జూనియర్ డ్రగ్ అనలజిస్ట్ డీకే రాముడు, ప్రిన్సిపాల్ కృష్ణ పాల్గొన్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో యోగా నిపుణులు అలేఖ్య విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కొండపల్లి డీఏవీ పాఠశాలలో యోగా గురువు లంకే జనార్దన్ యోగా ప్రయోజనాలు వివరించారు. జాకీర్ హుస్సేన్ కళాశాలలో ప్రిన్సిపాల్ మహబూషా యోగాపై అవగాహన కల్పించారు. కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా విద్యార్థులతో యోగాసనాలు చేయించారు.

గొల్లపల్లి హైస్కూల్లో..

నూజివీడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో పీడీ పీ రవీంద్ర విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు.



గంపలగూడెంలో ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులు

గంపలగూడెంలో..

గంపలగూడెం: క్రమం తప్పకుండా నిత్యం యోగా చేసేవారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలువురు వక్తలు తెలిపారు. గంపలగూడెం రామాలయంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా అభ్యాసకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తగుండ్ల అజయ్‌గుప్తా(బుర్రయ్య) ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం యోగా గురువు వనమా సుజాత ఆధ్వర్యంలో ఆరోగ్యవంతంగా ఉండేందుకు చేయాల్సిన పలు యోగాసనాలను, అభ్యాసకులు వేశారు.

నరసాపురంలో..

నరసాపురం (విస్సన్నపేట): క్రమం తప్పక కుండా యోగా చేయడం వలన ఆరోగ్యకరంగా ఉండవచ్చని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని నరసాపురంలో గురుకుల పాఠశాల సమీపంలో చెరువు వద్ద ఉపాధిహామీ కూలీలతో యోగా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామోపాధ్యాయురాలు ఈశ్వరి యోగాసనాలు చేయించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రతి మనిషీ తన ఆరోగ్య పరిరక్షణకు యోగా తప్పనిసరిగా చేయాలని లివింగ్ ఆర్ట్స్ సభ్యురాలు పాములపాటి లరహలిత తెలిపారు. బుధవారం చాట్రాయిలో నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హైస్కూల్ హెచ్‌ఎం జి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం పంచాయతీలో వీరయ్య చెరువు(అమృత సరోవర్ చెరువు) వద్ద బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా టీచర్ ప్రమోద్ భరద్వాజ్ పలు యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఏపీఓ ఏ. భాస్కరరావు, ఈసీ కె. రామారావు, ఎఫ్ఏ కుమారి పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: నిత్యం యోగా, ధ్యానంతో మంచి ఆరోగ్యం, రాజయోగం కలుగుతుందని స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి పేర్కొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా గురుకుల పాఠశాలలో పీఈటీ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. పలు యోగాసనాలు ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్వేతహార పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: యోగాతో మానసిక శాంతి చేకూరుతుందని జడ్జి ఎం. శైలజ తెలిపారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో మండలం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ శారీరక శ్రమతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కరాటే మాస్టర్, యోగా ఉపాధ్యాయులు పిట్టల అప్పారావు నిర్వహించిన యోగా కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.



తిరువూరు వాహినీ కళాశాలలో యోగాదినోత్సవం



గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల యోగాసనాలు



మైలవరంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో యోగా కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి శైలజ

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లతో జీవనోపాధి

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను విక్రయించే అవుట్‌లెట్ల ద్వారా ఎంతో మందికి జీవనోపాధి లభిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటుకు రూ.20 లక్షల వ్యయంకాగా ప్రభుత్వం నుంచి 60 శాతం సబ్సిడీ మంజూరైందన్నారు. సబ్సిడీ రూ.12 లక్షలు పోను రూ.8 లక్షల పెట్టుబడితో ఈ వ్యాపారాన్ని ప్రారంభించారని చెప్పారు. ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్‌ను మరింత ప్రోత్సహించేందుకు మత్స్య శాఖ ఇటువంటి అవుట్‌లెట్ల ఏర్పాట్లను చేపట్టిందన్నారు. రాష్ట్రంలో లభించే సముద్ర, రైతులు పెంచే మత్స్య ఉత్పత్తులను ఫిష్ ఆంధ్ర పేరుతో హబ్‌లు, అవుట్‌లెట్లు, యూనిట్స్, కియోస్కల ద్వారా విక్రయాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాల భరోసా ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకురాలు పోగుల రామలక్ష్మిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గంగవరపు శివాజీ, ధనేకుల చౌదరి, జాస్తి జగన్, గేరా సుమన్ పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

బ్యాంకింగ్‌పై క్విజ్ పోటీలు

తిరువూరు: రిజర్వు బ్యాంకు ఆదేశానుసారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు యూనియన్ బ్యాంకు తిరువూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు మండలంలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముష్టికుంట్ల జెడ్పీ హైస్కూలు జట్టు ప్రథమ బహుమతి, మునుకుళ్ళ, గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు యూనియన్ బ్యాంకు మేనేజరు కృష్ణప్రసాద్, క్విజ్ నిర్వాహకులు శారదా విజయభాను ప్రకటించారు. బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం పీఎస్ఎన్ రాజు బహుమతి ప్రదానం చేశారు.



క్విజ్‌పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

• ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదినీసింగ్ సూచించారు. చాట్రాయిలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి బుధవారం నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువులతో పంటలను పండించడం వల్ల భూసారం తగ్గిపోయి దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. సేంద్రియ ఎరువులతో పంటలను పండించుకోవాలని సూచించారు.

• ప్రతి ఇంటి అవసరాలను గుర్తించండి

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంట్లో అవసరాలను గురించాలని ఎంపీడీఓ దుర్గా ప్రసాదు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. వలంటీర్ పరిధిలో ఉన్న 50 గృహాలను సందర్శించి, వారికి కావాల్సిన ప్రభుత్వ పరంగా అందించే అవసరాలను గుర్తించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా అందించాలని సూచించారు. తహసీల్దార్ విశ్వనాథరావు, ఈఓపీఆర్‌డీ నాగరాజు, వెలుగు ఏపీఎం అశోక్ పాల్గొన్నారు.

• నూరుశాతం బకాయిల వసూలు

తిరువూరు: మండలంలోని మునుకుళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గత ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రుణ బకాయిలు వసూలైనట్లు తిరువూరు కేడీసీసీ బ్యాంకు శాఖా మేనేజరు చంద్రశేఖర ఆజాద్ తెలిపారు. ఆ సహకార సంఘ అధ్యక్షుడు వెదురు గోపిరెడ్డిని, కార్యదర్శి వెంకటరమణను బ్యాంకు ఆవరణలో బుధవారం అభినందించారు.

రాజవరం(గంపలగూడెం): రాజవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈ ఏడాది నూరుశాతం రుణాల రికవరీ అయినట్లు గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది మెంబర్ స్థాయిలో 259 మంది రైతుల నుంచి రూ. 2.26కోట్లు వసూలు అయ్యాయన్నారు. దీనికై సహకరించిన సొసైటీ అధ్యక్షుడు శేషగిరిరావు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

• విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గౌరంపాలెం (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ గౌరంపాలెం ఎస్సీవాడలో బుధవారం కోలేటి ప్రసాద్‌కు చెందిన తాటాకు ఇల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధం అయింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. నూతనంగా ఇల్లు నిర్మించేందుకు తెచ్చి ఉంచిన నగదుతో పాటు బంగారం అగ్ని ప్రమాదంలో దగ్ధం అయిందని వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ దంపతులు పిల్లి మెర్సీవనజాక్షి, రాజేష్ పరామర్శించి రెండు టిక్కీలు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కాలీషా, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

• నేత్రదానం

తిరువూరు: స్థానిక గణేష్‌సెంటర్లో బుధవారం సాయంత్రం మృతిచెందిన తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) సభ్యుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు జవ్వాజి శారదారావు(47) నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు. తోసా సభ్యుల ప్రోత్సాహంతో శారదారావు భార్య వాసవి, కుమారులు చరణ్, లోకేష్ నేత్రదానానికి అంగీకరించారు. తోసా, దోస్త్ సభ్యులు నాళ్లా కాశీ, పరసా నెహ్రూ, చిత్తలూరి సోమశేఖర్, యలమంచిలి నాగమల్లేశ్వరరావు తదితరులు శారదారావు మృతికి సంతాపం తెలియజేశారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రతి గ్రామంలో నిర్మిస్తున్న భవనాలను సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు భవనానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా ఇప్పటికే గ్రామాలలో సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్నెస్ సెంటర్లకు నూతన భవనాల నిర్మాణం, నాడు-నేడు కింద పాఠశాలల భవనాలు, ఆస్పత్రి భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలను మంజూరు చేసినట్లు చెప్పారు. వెంకటాపురంలో ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

చంద్రగూడెం(మైలవరం): అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంలో రూ.25లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి, రూ.20లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జీవెంకట్రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాలు నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

అభివృద్ధిని చేతల్లో చూపిన సీఎం జగన్

మొర్సుమల్లి(మైలవరం): అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేతల్లో చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లిలో రూ.30లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కమిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత బుధవారం శంకుస్థాపన చేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

రెడ్డిగూడెం: మండలంలోని కుదప గ్రామంలో రూ. 25లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, రాధమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుపతిరావు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం మండలం కుదపలో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే వసంత

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ సడక్ రోడ్‌లో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్ఐ పాపారావుకు వచ్చిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేశారు. రూ.43,620 స్వాధీనం చేసుకుని 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఏ.కొండూరు: తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నీరు అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. మండలంలోని కోమటికుంటకు రూ.18.50లక్షలు, దీప్లానగర్ రూ. 6.38లక్షలు, చైతన్య నగర్ రూ. 7.50లక్షలు, ఏ.కొండూరు తండా రూ. 8లక్షలు, గొల్లమందల తండా రూ. 8.98లక్షలు, పాత కొండూరు రూ. 11లక్షలు, వెస్ట్ మాధవరం రూ.13.13లక్షలు, ఈస్ట్‌మాధవరం రూ. 12.38 లక్షలతో పనులు ప్రారంభించి పైపులు ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే దీప్లా నగర్, చైతన్య నగర్, ఈస్ట్‌మాధవరం గ్రామాల్లో పనులు పూర్తి చేసి, తాగునీరు అందిస్తున్నామన్నారు. మండలంలో జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా రూ.85.92లక్షలతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

మైలవరం: రాష్ట్ర స్థాయి చెస్ అండర్-7 విభాగం పోటీలకు మైలవరం వివేకానంద హైస్కూల్ విద్యార్థి ఆదూరి స్పర్జన్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పీ రాజారెడ్డి బుధవారం తెలిపారు. వివేకానంద హైస్కూల్లో ఒకటో తరగతి చదువుతున్న ఆదూరి స్పర్జన్ ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ అండర్-7 విభాగంలో ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థి గతంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-12 ఓపెన్ చేగువీర మెమోరియల్ టోర్నమెంట్‌లో రెండో స్థానంలో, మరో విద్యార్థి ఆదూరి అడ్విన్ అండర్-9 విభాగంలో మూడో స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి స్పర్జన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ రాజారెడ్డి అభినందించారు.

బీసీ హాస్టల్లో జగనన్న ఆణిముత్యాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని మహాత్మా జ్యోతిరావ్ బీసీ వెల్ఫేర్ గురుకుల హాస్టల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రిన్సిపాల్ రామ్మోహనరావు హాస్టల్లో అత్యధిక మార్కులు సాధించిన టెన్త్‌క్లాస్ విద్యార్థులు బాణావత్ నవీన్ నాయక్ (544), గండేపల్లి దిలీప్‌కుమార్ (528), చలమల మనోజ్‌కుమార్ (527)కు నగదు ప్రోత్సాహం, మెడల్, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం నియోజకవర్గం కొండపల్లి మున్సిపాలిటీ డ్వాక్రా ఆర్పీలను సెర్ప్ నుంచి మెప్మాలోకి విలీనం చేయించిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం కొండపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్వాక్రా ఆర్పీలను సెర్ప్ నుంచి మెప్మాలో విలీనం చేసేందుకు సాంకేతిక సమస్య ఎదురవ్వగా మంత్రి జోగి రమేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించామని తెలిపారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆర్పీల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. దీంతో మున్సిపల్ కౌన్సిలర్ ఎం.చంద్రంతో పాటు మెప్మా ఎండీ విజయలక్ష్మిని కలవగా వారు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించారని తెలిపారు.